

గురుకుల పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - చింతలపూడి

నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యంగా లేకపోవడంతో ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమాల దేవి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలను ఆమె ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లలకు పెట్టే అన్నంలో పురుగులున్నాయని, ఏప్రిల్‌లో నిల్వ ఉంచిన బియ్యం నేడు వండటంపై ఆమె మండిపడ్డారు. పిల్లలకు ఉదయం అందించే అల్పాహారం కూడా నాణ్యంగా ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనుండి ఆహార విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఆమె అన్నారు. అలాగే పాఠశాల ప్రహరీ నిమిత్తంపై అధికారులకు లేఖ రాసి పంపించామని, హాస్టల్లో సెప్టిక్ ట్యాంక్ చాలా రోజుల నుండి నిండి అలానే ఎందుకు ఉందని ప్రశ్నించారు. అలాగే భోజనశాలను పిల్లలకు సరిపోయేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బియ్యం, కూరగాయల్లేవ్..!

రావికుంట పునరావాస కాలనీలో వరద బాధితుల కష్టాలు వర్ణనాతీతం

అధికారుల ప్రకటనలకు క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన లేదు

రాపాకగొమ్మి, గొమ్ముగూడెం గ్రామస్తుల తీవ్ర ఆవేదన

నాలుగు రోజులైనా అందని కనీస సాయం

తాగునీటికి కటకట

నిత్యావసర సరుకులు ఇవ్వాలంటూ వేడుకోలు

అధికారులెవ్వరూ రాలేదని బాధితులు ఆవేదన

మళ్లీ పెరుగుతున్న గోదావరి వరద ఉధృతి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పునరావాస కేంద్రాలకు తరలించిన వరద బాధితులకు కనీసంగా అవసరమైన బియ్యం, పాలు, నిత్యావసరాలు సైతం అందించని అత్యంత దారుణమైన పరిస్థితి కొనసాగుతోంది. తమ గోడు పట్టించుకునే వారే లేకుండా పోయారంటూ వరద బాధితులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కనీసం నిత్యవసర వస్తువులైనా అందించండి మహాప్రభో అంటూ వరద బాధితులు మొరపెట్టుకుంటున్నారు. గోదావరి వరద ఉధృతి పెరుగుతుండటంతో విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడులోని గ్రామాలను వరదనీరు చుట్టుముడుతోంది. ఇప్పటికే రెండు మండలాల్లోనూ పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామానికి చెందిన 200కు పైగా కుటుంబాలను, వేలేరుపాడు మండలం రాపాకగొమ్మి గ్రామానికి చెందిన దాదాపు 200 కుటుంబాలను రావికుంట పునరావాస కాలనీకి తరలించారు. సామగ్రి తరలించేందుకు అధికారులు ఎలాంటి వాహనాలూ ఏర్పాటు చేయకపోవడంతో వారే సొంతఖర్చులతో ఈ నెల 20వ తేదీన రావికుంట పునరావాస కాలనీకి చేరుకున్నట్లు వరద బాధితులు చెబుతున్నారు. పునరావాస శిబిరాలకు చేరి దాదాపు ఐదురోజులవుతోంది. ఉన్న ఫళంగా అధికారులు వచ్చి గ్రామం ఖాళీచేయాలని చెప్పడంతో అంతా హడావుడిగా వచ్చేశారు. పునరావాస కాలనీకి తరలించిన తర్వాత ఇప్పటి వరకూ బియ్యం, పాలు, కూరగాయలు వంటి నిత్యావసర వస్తువులు ఏ ఒక్కటీ అందించలేదని అంతా లబోదిబోమంటున్నారు.



కుక్కునూరు మండలం రావికుంట పునరావాస కాలనీలో ఉంటున్న రాపాకగొమ్మి గ్రామస్తులు

ఆదరాబాదరాగా వచ్చేయడంతో వండుకోవడానికి కూరగాయలుగానీ, చేతిలో డబ్బులు సైతం లేకుండా పోయాయని అంతా లబోదిబోమంటున్నారు. ట్యాంకర్‌తో పోస్తున్న తాగునీరు సైతం చాలకపోవడంతో ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. గతేడాది వరదలకు ఈ గ్రామాలకు చెందిన ప్రజలు వరద బాధితులుగా ఇదే కాలనీలో రెండు నెలలకుపైగా ఉన్నారు. పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకపోవడంతో వీరంతా మళ్లీ గ్రామాలకు తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఇప్పుడు మళ్లీ వరద వస్తుండటంతో బాధితులుగా పునరావాస కాలనీకి చేరారు. వరద ప్రాంతాల్లో మూడునెలలకు సరిపడ సరుకులు నిల్వ ఉంచామని, ఇబ్బందులు లేవని అధికారులు చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి సంబంధం లేకుండా పోయింది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే వరద ఉధృతి పెరిగి మరికొన్ని గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తే పరిస్థితి ఎలాఉంటుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకూ రావికుంట పునరావాస కాలనీకి అధికారులెవరూ రాకపోవడంపై బాధితులు తీవ్రఆవేదనకు గురవుతున్నారు. వరద బాధితులకు బియ్యం, నిత్యావసరాలు అందించడంతోపాటు, ఆర్థిక సాయం చేయకపోతే తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుంది.

బియ్యం కూడా ఇవ్వలేదు

గుమ్మల నర్సయ్య, రాపాకగొమ్మి, వరద బాధితుడు

వరద పెరుగుతుండటంతో చెప్పి గడిచిన నాలుగు రోజుల క్రితం రాపాకగొమ్మి గ్రామానికి చెందిన అందరిని రావికుంట పునరావాస కాలనీకి తరలించారు. తరలొచ్చిన వాహనాల ఖర్చు కూడా తామే పెట్టుకోవాల్సి వచ్చింది. ఇక్కడికొచ్చి ఐదురోజులవుతోంది. ఇప్పటి వరకూ బియ్యంగానీ, పాల నిత్యావసర వస్తువులు వంటివి ఏ ఒక్కటీ ఇవ్వలేదు. కట్టుబట్టలతో వచ్చేశాం. ఎలా బతకాలి. వెంటనే బియ్యం, నిత్యావసర సరుకులు అందించాలని కోరుతున్నాం.

మళ్లీ పెరుగుతున్న వరద ఉధృతి

గోదావరి వరద ఉధృతి మళ్లీ పెరుగుతోంది. భద్రాచలం వద్ద 43 అడుగులకు చేరిన నీటిమట్టం 39 అడుగులకు తగ్గడంతో వరద తగ్గుముఖం పడుతుందని భావించారు. ఆదివారం పరిస్థితి మళ్లీ మారిపోయింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43.3 అడుగులకు చేరుకుంది. పోలవరం కాఫర్‌డ్యాం వద్ద సైతం 33 మీటర్లకు నీటిమట్టం చేరింది. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు ఎక్కువగా కురుస్తుండటంతో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 50 అడుగులు దాటితే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో సగం గ్రామాలను ఖాళీచేయించి పునరావాస కేంద్రాలకు తరలించాల్సి ఉంటుంది. ఇప్పటికే పునరావాస కేంద్రాల్లో పరిస్థితి ఇలా ఉంటే బాధితులు పెరిగే కొద్దీ పరిస్థితి ఏమిటన్న భయం అందరినీ వెంటాడుతోంది. 2022 వరదలకు ప్రభుత్వం నుంచి సరైన సాయం అందక వరద బాధితులు తీవ్ర ఇబ్బందులు పడ్డ పరిస్థితి నెలకొంది.

పోలవరం వద్ద గోదావరి ఉధృతి

ఏ ఒక్క అధికారీ రాలేదు

ముత్యం వీరబాబు, రాపాకగొమ్మి, వరద బాధితుడు

మాకు సంబంధించిన మూడు కుటుంబాలు ఒకే ఇంట్లో ఉంటున్నాం. గ్రామం నుంచి వచ్చి నాలుగురోజులైనా కనీస సాయం అందించలేదు. ట్యాంకర్‌తో తాగునీరు పోస్తున్నా సరిపోవడం లేదు. ఏ ఒక్క అధికారీ ఇప్పటి వరకూ రాలేదు. బియ్యం, కూరగాయలు వంటివి కూడా ఇవ్వకపోతే ఎలా బతకాలి. చేతిలో డబ్బులు కూడా లేని పరిస్థితి. ప్రభుత్వం వెంటనే తమకు సాయం అందించాలి.

మంచినీళ్ల ప్యాకెట్‌తో సరిపెట్టారు

బాజిప్రసాద్, గొమ్ముగూడెం, వరద బాధితుడు

పునరావాస కాలనీకి చేరి నాలుగురోజులైంది. ఇప్పటి వరకూ మంచినీళ్ల ప్యాకెట్ ఇచ్చి సరిపెట్టారు. ఒక్క ట్యాంకర్‌తోనే తాగునీరు పోస్తున్నారు. ఏ మాత్రమూ సరిపోవడం లేదు. బియ్యం, నిత్యావసరాలు వంటివి ఇవ్వకపోతే ఎలా బతకాలి. మా గురించి పట్టించుకునేవారే లేకుండా పోయారు.

రవాణా శాఖ సేవలన్నీ ఆన్‌లైన్

వాహనదారులు మధ్యవర్తులను ఆశ్రయించొద్దు

అధికారులు అవినీతికి పాల్పడితే సమాచారమివ్వండి

జిల్లా ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్



రవాణా శాఖలో వాహనదారులకు అవసరమైన సేవలన్నీ ఆన్‌లైన్ అయ్యాయని, ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఏ అవసరం వచ్చినా నేరుగా తమ కార్యాలయానికి రావాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి అన్నారు. రవాణా శాఖలో అవినీతికి పాల్పడే వారి వివరాలను తమకు తెలియజేస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

ప్రశ్న : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు మీరు తీసుకునే చర్యలు, వాహనదారులకు ఇచ్చే సూచనలు సలహాలు ఏమిటి?

మైనర్లకు వాహనాలిచ్చి వాహనాలు నడపడం ద్వారా ఎక్కువమంది ప్రమాదాల బారిన పడుతున్నారు. కొత్తగా మోటర్ వాహన చట్టంను అటు పోలీస్ శాఖలోనూ పొందుపరచబడింది. చట్టం ప్రకారం మైనర్లకు వాహనాలిచ్చిన వారిపై కూడా కేసులు నమోదు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్లను విధిగా ధరించాలి. అలాగే సీట్ బెల్టును ధరించి ఉన్నప్పుడు ప్రమాదాలు జరిగితే వాటి ప్రమాద స్థాయి తగ్గిపోతుంది. ప్రమాదాల బారినపడిన వాహనాలను నడిపే వ్యక్తులకు డ్రైవింగ్ లైసెన్సు లేకుండా నడిపితే ఆ వాహనానికి ఉన్న బీమా కూడా వర్తించదు.

ప్రశ్న : జిల్లావ్యాప్తంగా ఉన్న పాఠశాల బస్సుల సంఖ్య ఎంత? ఇప్పటివరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందిన బస్సుల వివరాలుంటే చెప్పండి?

జిల్లావ్యాప్తంగా 969 పాఠశాలల బస్సులున్నట్లు రవాణా శాఖ గుర్తించింది. వీటిలో 846 బస్సులు ఫిట్‌నెస్ పొంది ఉన్నాయి. మిగిలిన బస్సుల్లో 15 బస్సులు వినియోగంలో లేకుండా రకరకాల సాంకేతిక లోపాల వల్ల అవి పక్కన ఉంచబడ్డాయి. 20 బస్సులు వివిధ లోపాలతో మెకానికుల వద్ద రిపేర్లలో ఉన్నట్లు గుర్తించాము. ఏవైనా పాఠశాల బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా వాటిని తిప్పితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము.

ప్రశ్న : పాఠశాల బస్సులకు ఉండాల్సిన నిబంధనలు?

పాఠశాల బస్సులకు మొత్తం 32 నిబంధనలున్నాయి. వీటికి లోబడి బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను మంజూరు చేస్తాము. వాటిలో ప్రాథమికంగా బస్సులో ఫస్ట్ ఎయిడ్ టూల్ బాక్స్ ఉండాలి. పిల్లలు బస్సుల నుండి క్షేమంగా కిందికి దిగేందుకు ఖచ్చితంగా ఫుట్ బోర్డులను ఏర్పాటు చేయాలి. డ్రైవర్ అతివేగంగా బస్సును నడపకూడదు. డ్రైవర్‌కు కనీసం ఐదు సంవత్సరాల సీనియార్టీ ఉండాలి. 60 ఏళ్లు దాటిన డ్రైవర్లను వినియోగించరాదు. పరిమితికి మించిన వేగంతోనే బస్సులను నడపాలి.

ప్రశ్న : ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ (బోర్డర్ చెక్‌పోస్టు) ఇటీవల కాలంలో వాహన తనిఖీ అధికారిని ఎసిబి అధికారులు ఆకస్మిక తనిఖీలో పట్టుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకునే చర్యలేమైనా ఉన్నాయా?

రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయం నుండి వెలువడిన ఆదేశాల మేరకు ప్రస్తుతం మన జిల్లాలో ఉన్న జీలుగుమిల్లి అంత:రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో పూర్తిగా నగదు బదిలీలను ఆపేశాము. ఎవరైనా సరిహద్దు చెక్‌పోస్టులో పన్ను చెల్లించాలనుకుంటే ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. వారి ఎటిఎం కార్డు ద్వారా గానీ, ఫోన్ పే ద్వారా గానీ నేరుగా రవాణా శాఖ వెబ్‌సైట్ నుండి పొందే విధంగా ఏర్పాట్లు చేశాము. ఈ జిల్లాలోనే కాకుండా ఎక్కడెక్కడ చెక్‌పోస్టులు ఉన్నాయో అన్ని చోట్లా ఇదే తరహాలో చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాకుండా వాహనాల పన్ను చెల్లింపును నేరుగా మీసేవ కేంద్రాల ద్వారా కట్టి వాహనాలను సరిహద్దు చెక్‌పోస్టును దాటించుకోవచ్చు.

ప్రశ్న : 15 ఏళ్ల కాల పరిమితి దాటిన వాహనాల తనిఖీలు ఎలా జరుగుతున్నాయి?

15 ఏళ్లుదాటిన వాహనాలను సీజ్ చేసి, వాటిని స్క్రాప్‌కు తరలించే ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నాం. సాధారణ వాహన తనిఖీల్లో భాగంగా కాలం చెల్లిన వాహనాలను కూడా తనిఖీ చేస్తున్నాం. వీటిలో కాలం చెల్లిన వాహనాలను గుర్తిస్తే వెంటనే వాటిని సీజ్ చేస్తున్నాము.

ప్రశ్న : కొందరు అవినీతి అధికారులు రోడ్లపై ఎంట్రీ పేరుతో వాహనదారుల నుండి లంచాలు వసూలు చేస్తున్నారు. వారిని అడ్డుకోవడానికి ప్రత్యేక చర్యలేమన్నా ఉన్నాయా?

ఎవరైనా అధికారులు వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో లంచం డిమాండ్ చేస్తే నేరుగా నాకు తెలియజేయండి. రవాణా శాఖ కార్యాలయ నెంబర్లకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే వెంటనే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : ప్రజలకు మీరిచ్చే సలహాలు, సూచనలు?

ప్రస్తుతం రవాణా శాఖ సేవలు ఎల్ఎల్ఆర్ డ్రైవింగ్ ట్రాక్‌లో డ్రైవింగ్ టెస్ట్ తప్ప మిగతా అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే ఉంచబడ్డాయి. వీటిని పొందేందుకు మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు. మీ-సేవ కేంద్రాల ద్వారా సంబంధిత చలానాలను చెల్లించుకుని ఆయా సర్టిఫికెట్లను పొందొచ్చు. వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుని వాహనాలు నడపండి.

ఏలూరులో ఆందోళన చేస్తున్న నాయకులు

మణిపూర్ సిఎం రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మణిపూర్‌లో మతోన్మాదుల అరాచకాలను అరికట్టలేని ఆ రాష్ట్ర సిఎం తక్షణం రాజీనామా చేయాలని, అక్కడ అల్లర్లకు పాల్పడిన మతోన్మాద దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మణిపూర్ దారుణాలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో రవి మాట్లాడుతూ సభ్య సమాజంలో అందరూ తలదించుకునేలా అత్యంత పాశవికంగా మణిపూర్‌లో మతోన్మాద అల్లరి మూకలు రెచ్చిపోయాయన్నారు. మూడు నెలలుగా అక్కడ మతోన్మాదం మూకలు కుక్కి గిరిజన తెగల ప్రజానీకంపై దాడులు, హత్యలు, మహిళలపై మానభంగాలకు పాల్పడుతుంటే బిజెపి ప్రభుత్వం ఏం చేస్తుందని, గాడిదకు పళ్లు తోముతుందా అని ప్రశ్నించారు. మణిపూర్‌లో ముగ్గురు మహిళలను చరబట్టి నగ్నంగా ఊరేగించడమే కాకుండా కుకి తెగకు చెందిన ఒకరి తల నరికి వేలాడదీసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందన్నారు. ఒక రాష్ట్రంలో మైనార్టీ తెగకు చెందిన ప్రజలు మూడు నెలలుగా హింసించబడుతుంటే దాడులకు పాల్పడుతున్న అల్లరి మూకలను అరికట్టకుండా కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి దుర్మార్గంగా వ్యవహరించిందని విమర్శించారు. బిజెపి గతంలో కూడా మోడీ ముఖ్యమంత్రిగా ఉండగా గుజరాత్‌లో ముస్లిం ప్రజానీకంపై ఇదేవిధంగా దాడులకు పాల్పడ్డారని గుర్తు చేశారు. నిండు గర్భిణీ కడుపు చీల్చి లోపల ఉన్న పసికందును త్రిశూలంతో పొడిచి చంపిన మతోన్మాద కర్కశత్వం మరిచిపోలేమని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేనలు బిజెపికి పరోక్షంగా ప్రత్యక్షంగా మద్దతు పలకడం గర్హనీయమన్నారు. మణిపూర్ ఘటనలు చూసైనా రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు బిజెపి పట్ల తమ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. మణిపూర్ దారుణాలను వైసిపి, టిడిపి, జనసేనలు ఇప్పటి వరకూ ఖండించకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్రపతి జోక్యం చేసుకుని మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని, భారత సమాజానికి ప్రధానమంత్రి మోడీ క్షమాపణ చెప్పాలని రవి డిమాండ్ చేశారు. పి.కిషోర్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం భారత లౌకిక రాజ్యాంగాన్ని కాలరాస్తుందని విమర్శించారు. ప్రజల సమస్యలు గురించి ఆలోచించకుండా ఉండేందుకే ప్రజల మధ్య కులమత వైష్యమ్యాలు సృష్టిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, ఎ.శ్యామలారాణి, నాయకులు పి.ఆదిశేషు, కొర్రి విజయలక్ష్మి, బి.జగన్నాథరావు, కంది విశ్వనాథం, కె.రామాంజనేయులు, కట్టా సత్యనారాయణ జి.రవికిషోర్, వైఎస్.కనకారావు, పి.రవికుమార్, ఎస్.సత్యనారాయణ, ఎం.ఇస్సాక్, జి.కోటేశ్వరరావు, జి.ఏసుబాబు, బి.శ్రీనివాస్, సిహెచ్.సీతయ్య బాలరాజు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మణిపూర్‌లో హింసను నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశాయి. ఆదివారం సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మణిపూర్‌లో ఆర్ఎస్ఎస్ గూండాల మారణ కాండపై కేంద్ర ప్రభుత్వ మౌనాన్ని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయం నుండి మసీదు సెంటర్, గంగానమ్మ గుడి సెంటర్ మీదుగా బస్టాండ్ వరకూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు పసల సూర్యారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బొడ్డు రాంబాబు, పట్టణ పౌర సమాఖ్య వంగ గోపి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, పట్టణ ఎస్ఎఫ్ఐ నాయకులు యశ్వంత్, మణి, సిఐటియు, ఆటో యూనియన్ నాయకులు నాని, సత్తిబాబు, సునీల్, భద్రం, డివైఎఫ్ఐ నాయకులు షేక్ మాబు సుభాని, ఎం రాజేష్, జి.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

మణిపూర్‌లో దారుణాలకు నిరసనగా క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యావేత్త ఆలుగు ఆనంద శేఖర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్‌లు, క్రైస్తవ సంఘాలు పాల్గొన్నారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని న్యాయవాది యు.ఏసుబాబు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న దాడులను ఖండిస్తూ జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డ్‌లో నిరసన సభ జరిగింది.

విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకించాలని ఏలూరు నగర అభివృద్ధి కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంటు ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేసింది. అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కె.రామాంజనేయులు అధ్యక్షతన 'విద్యుత్ సంస్కరణలు - ఛార్జీల పెంపు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కె.రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, ఆమ్ ఆద్మీ ఏలూరు కన్వీనర్ షేక్ మస్తాన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, చేతివృత్తుదారుల జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు, సిపిఐ నగర సహాయ కార్యదర్శి కె.వరప్రసాద్, ఎల్ఐసి ఏజెంట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.రవికిషోర్, పంపన రవికుమార్ తదితరులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 2020లో విద్యుత్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. దీని ఆధారంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వరంగంలో విద్యుత్‌ను తయారుచేయడం కంటే, విద్యుత్ కొనుగోలుకు ప్రయివేటు సంస్థలపైనే ఆధార పడాల్సి ఉంటుందని తెలిపారు. ఈ బిల్లును దేశంలో కేరళ, ఢిల్లీ, రాజస్థాన్, తెలంగాణ, తమిళనాడు తదితర రాష్ట్రాలు అమలు చేయబోమని ప్రకటించాయని వివరించారు. మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తూచా తప్పకుండా బిజెపి ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణలను అమలు చేయడం ప్రారంభించిందన్నారు. 2014 నుండి 2023 వరకూ విద్యుత్ సంస్థలకు వచ్చిన లోటు పేరుతో రాష్ట్ర ప్రజానీకంపై వైసిపి ప్రభుత్వం సర్దుబాటు, ట్రూ అప్, అదనపు ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచుతుందని విమర్శించారు. ప్రభుత్వ విద్యుత్ సంస్థల్లో యూనిట్ మూడు రూపాయలకు దొరికే అవకాశం ఉంటే, అదాని వంటి కార్పొరేట్ సంస్థల వద్ద యూనిట్‌కు రూ.10 నుండి రూ.20కు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని విమర్శించారు. త్వరలోనే విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించాలని చూస్తుందన్నారు. ఈ స్మార్ట్ మీటర్లు గౌతమ్ అధాని కంపెనీ నుండి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని నిర్ణయించిందన్నారు. స్మార్ట్ మీటర్లకు అయ్యే ఖర్చు మొత్తం విద్యుత్ వినియోగదారుల నుండే వసూలు చేయాలని ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఇంటి పన్ను, ఆస్తి, నీటి పన్ను ఆఖరుకు చెత్త సేకరణ పన్ను కూడా రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రజలపై భారం మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న ధరల భారాలపై వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు నగరంలో వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. 25వ తేదీన ఏలూరు వసంత మహల్ సెంటర్ వద్ద సంతకాల సేకరణ, 28వ తేదీన విద్యుత్ జిల్లా కార్యాలయం వద్ద నిరసన తెలపాలని నిర్ణయించింది. ప్రజానీకమంతా సోషల్ మీడియా ద్వారా వివిధ రూపాల్లో విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రెటరీ డి.చంద్రశేఖర్, ఆమ్ ఆద్మీ పార్టీ నగర నాయకులు ఆంజనేయరాజు, వివిధ ప్రజా సంఘాల నాయకులు కనకారావు, గౌడ రవీంద్ర, నరసింహమూర్తి, ఎల్.సత్యనారాయణ, మీసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నేత

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణంపాలైన ఘటన పెదపాడు మండలం కలపర్రు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు పవర్‌పేటలోని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మహిళలు తమ సొంత కారులో గుడివాడలో ఉన్న బంధువులను చూసేందుకు బయలుదేరారు. ఏలూరుకు చెందిన కారు డ్రైవర్ శ్రీనివాస్‌ను ఆక్టింగ్ డ్రైవర్‌గా నియమించుకుని ఇంటి వద్ద నుండి బయలుదేరారు. కలపర్రు కొత్త టోల్ ప్లాజా సమీపానికి చేరుకునేసరికి డ్రైవర్ మూడో లైన్ నుండి నాలుగో లైన్‌కు వేగంగా తిప్పాడు. దీంతో కారు అదుపుతప్పి నాలుగో లైన్‌లో ఏర్పాటు చేసిన బారికేడ్లను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. దీంతో డ్రైవర్ శ్రీనివాస్, ఆ పక్కనే కూర్చున్న గండికోట శారద(62) అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక ఉన్న సన్నిధానం కామేశ్వరి, గరిమెళ్ల లలిత తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పెదపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతిచెందిన శ్రీనివాస్, శారద

పోరుబాట

'సమస్యలు పేరుకుపోతున్నాయి. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పాలకుల్లో ఎలాంటి చలనమూ లేదు. ఈ తరుణంలో బతుకుబండి లాగాలంటే పోరుబాట పట్టక తప్పదని, ఇటీవల కాలంలో వివిధ తరగతుల ప్రజలు చేపట్టిన ఆందోళనలు చెప్పకనే చెబుతున్నాయి. ఆశా వర్కర్లు, మున్సిపల్ కార్మికులు, విఆర్ఎలు చేపట్టిన ఆందోళనలే దీనికి నిదర్శనం. ఇక దైనందిన సమస్యగా మారిన చేపల చెరువుల అక్రమ తవ్వకాలపై మరోసారి బాధిత జనం కలెక్టరేట్ వద్ద నినదించారు.

వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగేళ్లు దాటింది. మరో తొమ్మిది నెలల్లో ఎన్నికలు రానున్నాయి. అయినా గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలేవీ పాలకులకు గుర్తుకు రాకపోవడం చిరుద్యోగులను కలవరపరుస్తోంది. దీనికితోడు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో బతుకు బండి లాగడం చాలా కష్టంగా మారింది. గ్రామాల్లో ప్రజలతో మమేకమై వారి ఆరోగ్యానికి సంబంధించి నిత్యం చేదోడువాదోడుగా ఉండే ఆశా వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ల వద్ద కదంతొక్కారు. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అధికారుల వేధింపులు ఆపాలని, జాబ్‌ఛార్ట్‌ను పక్కన పెట్టి విధులు అప్పగించడం మానుకోవాలనేది వారి ప్రధాన డిమాండ్లు. ఇవేమీ వారు కొత్తగా కోరుకునేవి కాదు.. గొంతెమ్మ కోర్కెలు అసలు కానేకాదు. ప్రస్తుత పాలకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలనే కోరుతున్నారు. ఇక జాబ్‌ఛార్ట్ నిర్దేశించిందీ ఉన్నతాధికారులే. దాన్ని అమలు చేయాలని, అదనపు పనులు ఆపాలనేది వారి విజ్ఞప్తి. పెరిగిన ధరలకు అనుగుణంగా నేటి పాలకులు నాటి హామీలు అమలు చేసినా ఆశా వర్కర్ల కుటుంబాలు తమ బతుకుబండి లాగడం ఇబ్బందే. అయినప్పటికీ కేవలం మీరిచ్చిన హామీలే అమలు చేయాలని కోరుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం గమనార్హం.

ఇక మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు రెండు రోజులు నిరసన దీక్ష చేపట్టారు. వారు కూడా ఆశాల మాదిరిగానే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైసిపి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తాము అధికారంలోకి రాగానే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరికీ న్యాయం చేస్తామని, రెగ్యులర్ చేస్తామని నాడు పాదయాత్రలో ప్రతిపక్ష నేతగా జగన్ హామీ ఇచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంట్రాక్టు కార్మికుల రెగ్యులర్ ఫైల్ కదిపి దానిలోనూ కొర్రీలు పెట్టారు. 2014 ముందు ఐదేళ్ల సర్వీసు నిబంధన వల్ల గత పదేళ్లుగా ఇదే పనిలో ఉంటున్న వేలాది మంది ఉపాధికి భద్రత లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో తమను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు ఆందోళన బాట పట్టారు. ఇప్పటికీ ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లు నెరవేర్చకుంటే తదుపరి పోరుబాట కార్యాచరణను సైతం మున్సిపల్ కార్మికులు ప్రకటించడం విశేషం.

గ్రామాల్లో నిత్యం రేయనక, పగలనక అన్ని కాలాల్లోనూ నిరంతరం సేవలందించే విఆర్ఎలు సైతం రెండు రోజులు నిరసన దీక్షలు చేపట్టారు. వారు సైతం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలనేది వారి ప్రధాన డిమాండ్. ఇలా వివిధ తరగతుల ప్రజలు పోరుబాట పడుతున్నారు. వారి ప్రధాన డిమాండ్ 'గతంలో మీరిచ్చిన హామీలు అమలు చేయండి' అనేదే తప్ప కొత్తగా కోరుతున్నదేమీ లేదు. మరి పాలకులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

కొల్లేరు ప్రాంతంలో ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు తీవ్ర అలజడి సృష్టిస్తున్నాయి. నివాసాలకు సమీపంలో, తాగునీటి చెరువుల పక్కన సైతం ఆక్వా చెరువులు యథేచ్ఛగా తవ్వేయడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. ప్రధానంగా కైకలూరు నియోజకవర్గంలో అత్యంత భయానక పరిస్థితులు నెలకొన్నాయి. అధికార పార్టీ నేతలు యథేచ్ఛగా చెరువులు అక్రమంగా తవ్వుతున్నా అధికార యంత్రాంగం సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. ఈ క్రమంలో వివిధరూపాల్లో ఆందోళనలు చేసినా అధికారులు స్పందించకపోగా అక్రమ చెరువుల తవ్వకందారులు బాధిత ప్రజలను బెదిరింపులకు గురిచేశారు. దీంతో బాధిత ప్రజలంతా సిపిఎం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు. కలెక్టర్‌కు సమస్యలను వివరించారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమ చెరువుల తవ్వకాలను ఆపాలని కలెక్టర్ ఆదేశాలిచ్చినా క్షేత్రస్థాయిలో యంత్రాంగం ఆ దిశగా కదులుతున్న పరిస్థితి లేదు. చెరువుల తవ్వకం పూర్తయ్యాక అనుమతులు లేని మాట వాస్తవమేనని, కోర్టు ఉత్తర్వులున్నాయని చెప్పి తప్పించుకోవడం మినహా అసలు అనుమతులు ఎలా ఇచ్చారనే దానికి ఎక్కడా సమాధానం ఉండటం లేదు. దీంతో బాధిత ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి జనావాసాలకు, తాగునీటి వనరులకు, ప్రజల జీవనానికి ఇబ్బంది లేకుండా చెరువుల తవ్వకాన్ని అడ్డుకోవాల్సిన అవసరం, బాధ్యత తప్పనిసరిగా ఉంది. లేనిపక్షంలో ఏదోక రూపంలో బాధిత ప్రజలంతా పోరుబాట పడతారనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

-వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా రెగ్యులర్ చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్(సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ జఫ్రుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం టి.శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జఫ్రుల్లా మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తానని వాగ్దానం చేసి ఇప్పుడు కొద్దిమందిని మాత్రమే చేస్తానని చెప్పడం తగదన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మొత్తం కాంట్రాక్టు ఉద్యోగులపై ఆధారపడి పనిచేస్తుందని, ఎంతో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో అవినీతి విలయతాండవం చేస్తోందని విమర్శించారు. ప్రతీపనికి జిల్లా డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో డబ్బులు వసూలు చేయడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకుని వైద్య ఆరోగ్యశాఖలో జరుగుతున్న అవకతవకలపై స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు డి.వేణుగోపాలచారి, ఎం.బాలరాజు, ఎ.సులోచన, ఎ.సునీల్, సుభాషిణి పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శి డి.వేణుగోపాలచారికి అభినందనలు

డి.వేణుగోపాలచారి

యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన డి.వేణుగోపాలచారిని ఈ సమావేశంలో అభినందించారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై కృషి చేస్తానని ఆయన తెలిపారు.

పారిశుధ్య కార్మికురాలి మృతికి సంతాపం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లికి చెందిన పారిశుధ్య కార్మికురాలు బంతుల మహాలక్ష్మి(35) అనారోగ్య కారణంగా శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రవేట్ హస్పిటల్‌లో మృతి చెందారు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కలరు. ఆమె గత పది సంవత్సరాలుగా ఆగిరిపల్లి గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికురాలుగా పనిచేసి, పలు సేవలను అందించారు. ఆమె భౌతికకాయాన్ని పలువురు ఆగిరిపల్లిలోని ఆమె స్వగృహం నందు సందర్శించి నివాళులు అర్పించి, ఆమె కుటుంబానికి ప్రగాఢసానుభూతిని తెలియజేశారు.

వాలంటీర్లకు, అంగన్‌వాడీలకు సత్కారం

టి.నరసాపురం: మండలంలోని పుట్రేపు, ప్రకాష్ నగర్ గ్రామాలకు చెందిన గ్రామ వాలంటీర్లు జి.భారతి, పి.అరుణ, అంగన్‌వాడీ టీచర్ కె.మల్లీశ్వరీలను వారు అందిస్తున్న సేవలకు గౌరవంగా కృష్ణాపురం గ్రామానికి చెందిన భూక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూక్యా వేణుగోపాల్ అధ్యక్షతన ఆదివారం వారిని సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాలంటీర్ల, అంగన్‌వాడీల సేవలను కొనియాడారు. మానవసేవయే మాధవసేవ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భూక్యా శ్రీనివాస్, కుంజా కిరణ్, బరగడ రాముడు, పండు వీరభద్రుడు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

చింతలపూడి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చింతలపూడి మండల ఎంపిపి డా.బాణవతు రాంబాబు అన్నారు. రెచర్ల పంచాయతీ2 మైలులోని తండాలో రూ.15లక్షలు ఎంపిపి గ్రాంట్‌తో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గ్రామాలలోని సమస్యలు తెలుసుకుంటున్నామని, ప్రయారిటి ప్రకారంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శివరామకృష్ణ, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

20 మంది రక్తదానం

ఏలూరు అర్బన్: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏలూరు వైభవ్ జ్యూయలరీస్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 20 మంది షోరూం సిబ్బంది రక్తదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. వైభవ్ జ్యూయలరీస్ అధినేత గ్రంధి అమరేంద్ర ఆదివారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లడుతూ వైభవ్ జ్యూయలరీస్ సిబ్బంది రక్తదానం చేయడానికి ప్రేరేపించి, రక్తదానం చేసేలా ప్రోత్సహించినందుకు గ్రంధి అమరేంద్రకు రెడ్ క్రాస్ తరపున అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాదరావు, జ్యూయలరీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ప్రత్యేక పథకాలు : టిడిపి

భీమడోలు: రానున్న ఎన్నికలకు టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టోలో భాగంగా పార్టీ ఆదేశాల మేరకు మహిళలకు ప్రత్యేకించిన పథకాలను మహాశక్తి కార్యక్రమం కింద ప్రచారం చేయనున్నట్లు టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమం ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో 50 రోజులపాటు కొనసాగుతుందన్నారు. భీమడోలులోని వెలంపేటలో గల సీతారామాంజనేయ ఆలయం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాల్ని ఆయన ప్రారంభించారు.

మణిపూర్ హింసాకాండ దారుణం : సిపిఎం

ముసునూరు :మణిపూర్‌లో గత రెండు నెలల నుంచి హింసాత్మకమైన సంఘటనలు జరగడం దారుణమని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు జి.రాజు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ మణిపూర్‌లో ఇద్దరు మహిళలను ఆవస్త్రాలు లేకుండా నడిరోడ్డుపై ఊరేగించడం దారుణమని తెలిపారు. వీటిని ఖండిస్తూ వారం రోజుల పాటు ప్రధాన మండల కేంద్రాల్లో నిరసనలు, రాస్తారోకోలు, ధర్నాలు మహిళ సంఘాలతో పాటు అవసరమైతే వామపక్షాల మద్దతు కలుపుకొని చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముసునూరు మండల కార్యదర్శి పిల్లి మురళీ, పోట్రు శ్రీనివాసరావు, కంచర్ల శ్రీనివాసరావు, రమేష్, సిహెచ్ శ్రీనివాసరావు, కోడవలి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - భీమడోలు

శివారులోని రైల్వే గేటు వద్ద చేపల చెరువులకు మేతగా తరలిస్తున్న నిషేధిత కోళ్ల వ్యర్థాలను తనిఖీలలో పట్టుకున్నట్లు భీమడోలు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఆదివారం కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న మినీ వ్యాన్‌ను సీజ్ చేసి, ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ అన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన మినీ వ్యాన్ యజమాని జల్లూరి వెంకటరమణ తన మినీ వ్యాన్‌పై డ్రయివర్‌గా పనిచేస్తున్న భలే సూర్యనారాయణతో కలిసి రాజమండ్రి పట్నంతో పాటు దాని పరిసర ప్రాంతాల్లోని వివిధ చికెన్ దుకాణాల నుంచి రెండు టన్నుల కోళ్ల వ్యర్థాలను సేకరించారు. వీటిని భీమడోలు మండలం ఆగడాల లంకతో పాటు దాని పరిసర ప్రాంతాల్లో గల చేపల చెరువులకు మేతగా తరలించేందుకు మినీ వ్యాన్‌లో రాజమండ్రి నుంచి ఆగడాల లంకకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. కేసును ఎస్ఐ సురేష్ దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని దర్భగుడెం శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు ఆదివారం ఎస్ఐ అధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. ఈ దాడులలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5,900 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఐదుగురు వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఉన్నతాధికారుల ఆదేశానుసారం మండల పరిధిలోని శోభనాపురం గ్రామ పొలిమేరల్లో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు తన సిబ్బందితో దాడి చేసి ఆరుగురు పందెంరాయుళ్లను అదుపులోనికి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి రూ.5,200లు, ఒక కోడిపుంజును, నాలుగు కోడికత్తులను, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనపర్చుకొని వారిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ చంటిబాబు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చినుకు పడితే చిత్తడే

అధ్వానంగా కైకరం - తిమ్మయ్యపాలెం రోడ్డు

ప్రజాశక్తి - ఉంగుటూరు

తిమ్మయ్యపాలెం నుంచి కైకరం వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. చినుకు పడితేచిత్తడి, బురద కారణంగా విద్యార్థులు బడి మానేయాల్సి వస్తోంది. తిమ్మయ్యపాలెం నుంచి కైకరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులు 35 మంది వరకూ ఉన్నారు. వారంతా రోజూ రానూ పోనూ ఏడు కిలోమీటర్లు సైకిల్ తొక్కుతూ బడికి రావాల్సి వస్తోంది. కైకరం- అక్కుపల్లిగోకవరం అడ్డరోడ్డు నుంచి చేబ్రోలు - తిమ్మయ్యపాలెం వరకూ సుమారు 1.9 కిలోమీటర్ల మేర పిఐయు తారు రోడ్డు పూర్తిగా శిథిలమై తారు రోడ్డు ఆనవాళ్లు కనిపించనంతగా శిథిలమైంది. గ్రావెల్ తోలే భారీ వాహనాల వల్ల ఈ రోడ్డు పాడైంది. అప్పటి నుంచి ఎలాంటి అభివృద్ధికీ నోచుకోలేదు. గతుకుల రోడ్డుపై రోజూ బడికి వెళ్లి రావాలంటే విద్యార్థులు నానాఅవస్థలు పడుతున్నారు. దీనికితోడు వానకాలంలో బురదకారణంగా సైకిల్ అదుపుతప్పి పడిపోవడం తదితర కారణాలతో బడి మానేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఆర్థిక స్తోమతి ఉన్నవారు ప్రయివేటు స్కూలుకు వెళ్లిపోతున్నారని, రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అద్వానంగా ఉన్న రోడ్డు..

రూ. 60 లక్షలు నిధులు మంజూరు

చైతన్యనాయుడు, పిఐయు ఎఇ

కైకరంలో జగనన్న కాలనీ నుంచి తిమ్మయ్యపాలెం - చేబ్రోలు అడ్డ రోడ్డువరకూ 1.9 కిలోమీటర్ల వరకూ తారురోడ్డు నిర్మాణానికి నాలుగేళ్ల క్రితమే ఎపి రోడ్స్ ప్రాజెక్టు గ్రాంటు నుంచి ఆసియన్ బ్యాంకు ద్వారా రూ.60 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు చేసేందుకు టెండర్లు పిలిచినా ఎవ్వరూ ముందుకు రాలేదు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కలిదిండి

మండవల్లిలోని బాలికల వసతిగృహంలో చదువుతున్న మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. కలిదిండిలో ఆయన మాట్లడుతూ 10 ఏళ్ల బాలికపై ఆరు నెలలుగా అత్యాచారానికి ఒడికట్టడం అత్యంత హేయమైన చర్య అన్నారు. రోజురోజుకూ బాలికలు, మహిళలపై అత్యాచారాలు పెరిగి పోతున్నాయన్నారు. యువత మద్యం మత్తులో వాయివరుసలు మరిచి క్రూరంగా ప్రవర్తించడం దారుణమన్నారు. మహిళలు బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. బాధితురాలిని ప్రభుత్వమే అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు జక్కుల మహేష్, చిన్నం మాధవ, కార్యకర్తలు చీకటి సత్యనారాయణ, బొడ్డు సురేష్ పాల్గొన్నారు.

గిరిజనుల సాగుభూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

అదివాసీలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. మండలంలోని మక్రిగూడెం గ్రామంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ మండలంలోని బండివారిగూడెం రెవిన్యూ పరిధిలోని ఆరు గ్రామాల అదివాసీలు సాగులో వున్న భూములను భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి ఆన్‌లైన్ చేయించుకున్నారని ఆరోపించారు. అదివాసీలకు భూములు ఇచ్చిన రైతులకు నోటీసులు ఇచ్చి విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తొట్టి నాగేశ్వరరావు, తొట్టి కృష్ణ, చిన రాజులు, సూర్యారావు, కురసం కన్నయ్య, కొండరావు, ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

'మరో మణిపూర్‌లా ఎపి'

ప్రజాశక్తి - చింతలపూడి

ఎస్‌సి, ఎస్‌టి దాడుల్లో ఆంధ్రప్రదేశ్ మరో మణిపూర్‌లా తయారైందని ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్ అన్నారు. ఒక ప్రకటనలో వారు తెలిపిన వివరాలు ప్రకారం అధికార పార్టీ అండదండలతో ఒంగోలులో నవీన్ అనే దళితుడిని కొంతమంది కొట్టి చిత్రహింసలు పెట్టి, నోట్లో మూత్రం పోసినా కూడా ప్రభుత్వం తమకేమీ పట్టనట్లు వ్యవహరించిందన్నారు. వెంటనే ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు అమలయ్యే సంక్షేమ పథకాల మీద శ్వేతపత్రం విడుదల చేయాలని అనీష్ డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టిలకు అమలయ్యే 27 సంక్షేమ పథకాలు రద్దుచేసి ఎస్‌సి, ఎస్‌టి, బిసిలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దళితుల మీద ఎన్ని దాడులు జరిగినా జగన్ ప్రభుత్వం దాడులు చేసిన వారిని వదిలిపెట్టి, తిరిగి దళితులు బాధితుల మీదే కేసులు బనాయించి చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బొబ్బర రాజ్ పాల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ఇస్తానన్న జగన్ జాబ్ క్యాలెండర్ ఏమో కానీ దండుకున్న డబ్బులతో సాక్షి క్యాలెండర్ మాత్రం ప్రతి ఇంటికి ఫ్రీగా వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్‌జిఒ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గ ఎన్నికల నిర్వహణ ఆదివారం ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనంలో జరిగింది. ఎన్నికల అధికారిగా ఎపిఎన్‌జిఒ కార్యదర్శి నెరసు వెంకట రామారావు వ్యవహరించారు. ఛైర్మన్‌గా యాసలపు శ్రీను, వైస్ ప్రెసిడెంట్‌లుగా జాగర్లమూడి శ్రీనివాసరావు, కర్రా రామకృష్ణ, కార్యదర్శిగా సోదిమెళ్ల శివ, జాయింట్ సెక్రటరీలుగా తుపాకుల సత్యనారాయణ, నెరుసు సత్యనారాయణ చింతా రంగారావు, శీలం మోహన్, కోశాధికారిగా ఒగ్గు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగుల సమస్యలపై పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ ఎపిఎన్‌జిఒ అధ్యక్షులు శ్రీధర్ రాజు, జిల్లా జాయింట్ సెక్రెటరీ మాదాసు సాంబశివరావు, నాయకులు, మహిళా కార్యవర్గం పాల్గొన్నారు.

హత్య కేసు ఆరోపణలున్నవారికి ఉద్యోగాలా..! : టిడిపి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాధా అనే మహిళాధికారిని ఏలూరు డిప్యూటీ కమిషనర్‌గా తీసుకువచ్చారని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి బండేటి చంటి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అవినీతి కంపు కొడుతున్న ఏలూరు కార్పొరేషన్‌ను మరింత అవినీతిమయం చేసేందుకు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొద్దుటూరులో ఆమె బాధ్యతలు స్వీకరించిన తర్వాత కార్పొరేషన్‌లో జరిగిన తాజా అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరనున్నట్లు ఆయన తెలిపారు. పవర్ పేటలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు ఎంఎల్‌ఎ, కమిషనర్, డిప్యూటీ కమిషనర్లపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఎంఎల్‌ఎ సిఫార్సు లేఖ లేకుండా డిప్యూటీ కమిషనర్ రాధా ఇక్కడ బాధ్యతలు స్వీకరించారా అని ఆయన ప్రశ్నించారు. ఈ పోస్టింగ్ వెనుక కూడా భారీ ఎత్తున డబ్బులు చేతులు మారాయని ఆయన విమర్శించారు. డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమె బంధువు చంద్రశేఖర్ మధ్యవ్యక్తిగా వ్యవహరిస్తూ కార్పొరేషన్‌లోని ఎఇలు, డిఇలకు ఫోన్లు చేస్తూ, వారిని బెదిరింపులకు గురి చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ విధంగా డిప్యూటీ కమిషనర్ వసూలు చేసిన డబ్బులు ఏలూరు ఎంఎల్‌ఎకి వెళ్ళాయా లేక కమిషనర్‌కి వెళ్లాయా ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. ఎంఎల్‌ఎ ఒత్తిడితో నగర మేయర్ ఈ విషయంలో మిన్న కుండిపోయారని బడేటి చంటి అన్నారు. కార్పొరేషన్‌లో ఇంత అవినీతి జరుగుతున్నా తాము ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉండిపోయామని పలువురు సీనియర్ కార్పొరేటర్లు ఆవేదన చెందుతున్నారన్నారు. గతంలో ఏలూరు ఎంఎల్‌ఎగా బడేటి బుజ్జి ఉన్నప్పుడు ఆర్థికంగా నష్టపోయిన ఒక కుటుంబానికి చేయూతనందించాలన్న లక్ష్యంతో సాయి బాలాజీ థియేటర్ సమీపంలో ఒక హోటల్ నిర్వహణకు స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగమేఘాల మీద ఆ హోటల్ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారని పేర్కొంటూ కూల్చివేశారని పేర్కొన్నారు. అయితే ఇప్పుడు రూ.10 లక్షలు తీసుకుని ఆ స్థలాన్ని వేరే వారికి కట్టబెట్టేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని బడేటి చంటి ఆరోపించారు. ఇంత జరుగుతున్నా నగర మేయర్ మాట్లడలేని పరిస్థితుల్లో ఉన్నట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. ఈ వ్యవహారాలన్నింటిని జిల్లా కలెక్టర్ దృష్టికి సాక్ష్యాదారాలతో తీసుకువెళ్లి విచారణ చేయించమని కోరతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, వందనాల శ్రీనివాసరావు, తంగిరాల సురేష్, పెద్దిబోయిన శివప్రసాద్, గూడవల్లి శ్రీనివాస్, బొరోత్ బాలాజీ, రెడ్డి నాగరాజు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కుకునూరు

గోదావరి వరద చుట్టుముట్టడంతో రావికుంట పునరావాస కేంద్రంలో తలదాచుకున్న గొమ్ముగూడెం బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుని వారికి అవసరమైన వసతులను కల్పించాలని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బొరగం శ్రీనివాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పునరావాస కాలనీలో తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరద బాధితులు తమని ప్రభుత్వం ఏమి పట్టించుకోవడం లేదని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పునరావాసానికి పంపిస్తే వెళ్లిపోతామని, గోదావరి వరదలు అంటే ప్రతి సంవత్సరం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాల్సి వస్తుందని తెలిపారన్నారు. ఇక్కడ పరిస్థితులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకువెళ్తున్నామని బొరగం శ్రీనివాసులు తెలిపారు. గత వరదల సమయంలో వేలేరుపాడు మండలం కన్నాయిగుట్ట వచ్చిన ముఖ్యమంత్రి రెండు నెలల్లో పూర్తి పరిహారం ఇస్తామని చెప్పి ఏడాది గడుస్తున్నా నేటికీ పరిహారం ఊసే లేదన్నారు. ఇంకెన్ని రోజులు నిర్వాసితుల జీవితాలతో చెలగాటం ఆడతారని, ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని, త్వరలోనే జగన్ రెడ్డికి నిర్వాసితులు గట్టిగా బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు మధుర వెంకటరమణ, కోటగిరి సత్యనారయణ పాల్గొన్నారు.

వెలుగు విఒఎలకు కనీస వేతనాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వెలుగు విఒఎలకు కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం విఒఎల జిల్లా సమావేశం లక్ష్మి రాధా అధ్యక్షతన ఏలూరు సిఐటియు ఆఫీసులో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ విఒఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిన్న సంఘాలకు అనేక ప్రభుత్వ పథకాలు అందిస్తున్నా వీరికి కనీస వేతనాలు లేవని, అదే కాక ప్రస్తుతం ఇస్తున్న రూ.8 వేలు పూర్తి స్థాయిలో ఇవ్వటం లేదని ఆయన వాపోయారు. పెర్ఫార్మెన్స్ పద్ధతిలో ఇస్తూ కోతలు విధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విఒఎలకు పదివేల వేతనం పెట్టి ఎనిమిది వేలు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,000 విఒఎ ఇవ్వాలని నిర్ణయించడం జరిగినా, కానీ ప్రస్తుతం రూ.8 వేలు పూర్తిస్థాయిలో రావడం లేదన్నారు. విఒఎల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ.నిర్మలాదేవి, జిల్లా కార్యదర్శి ఎస్‌కె సుభాషినిలు మాట్లాడుతూ విఒఎలకు పెనుబారంగా మహిళా మార్టులు పెట్టి ఇప్పటికే చిన్న సంఘాలకు కోళ్లు, గొర్రెలు, మేకలు, గేదెలు ఇచ్చి అభివృద్ధి చేయాలని చెప్పి చిన్న సంఘాలపై ఒత్తిడి తెచ్చే విధంగా పని చేయిస్తున్నారన్నారు. ఇవే కాక ఐడి కార్డ్స్, యూనిఫామ్ సౌకర్యం ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా అధిక పని భారం పెట్టి ఒత్తిడి చేస్తున్నారని, పని భారం తగ్గించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో విఒఎల సంఘం జిల్లా నాయకులు లక్ష్మి, జె.మేరీ పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం

ఉమ్మడి జిల్లా అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

ఏలూరు అర్బన్: ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు అడ్‌హక్ కమిటీని స్థానిక రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌కుమార్ మాట్లాడుతూ నూతన కమిటీ ఉద్యోగులకు అన్నివేళలా అండగా ఉంటూ సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మల్లేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి ఆర్.శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఇదే..

అడ్‌హక్ కమిటీ అధ్యక్షులుగా వీరవల్లి వీరాస్వామి, కార్యదర్శిగా పి.ఆకాష్, సహఅధ్యక్షులుగా కె.కోశారావు, ఉపాధ్యక్షులుగా తుపాకుల సత్యనారాయణ, ఎం.నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా పి.ఆదినారాయణ, వారణాసి మణి, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.వెంకట ఆదిలక్ష్మి, కోశాధికారిగా చింతగుంట సురేష్‌కుమార్ ఎన్నికయ్యారు.

అందరి అభిప్రాయాలు తీసుకున్నాకే పార్టీ వెల్లడి

ప్రజాశక్తి - ఉంగుటూరు

వట్టి కుటుంబ రాజకీయ వారసుడిగా తాను నియోజకవర్గంలో ముఖ్యనేతలు, నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజాసంఘాలను మర్యాదపూర్వకంగా కలుస్తున్నానని, అందరి అభిప్రాయాలు తీసుకున్నాకే తాను ఏపార్టీలోకి చేరాలనేది నిర్ణయం తీసుకుంటానని వట్టి వసంత్‌కుమార్ వారసుడు వట్టి పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన అనుచరులు, మద్దతుదారులు, స్నేహితులతో కలిసి కైకరం, ఉంగుటూరులో ముఖ్యనాయకుల ఇళ్లకు వెళ్లి పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా ఉంగుటూరు పవన్‌కుమార్ ప్రజాశక్తితో మాట్లాడుతూ చిన్నాన్న మాజీ మంత్రి దివంగత వట్టి వసంతకుమార్‌తో అనుబంధం ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో తనకు పరిచయం లేదని, అందుకే ముందుగా గ్రామాల వారీగా ఆయా నాయకుల ఇళ్లకు వెళ్లి పరిచయ కార్యక్రమానికి స్వీకారం చుట్టినట్టు తెలిపారు. ఇంతవరకూ మండలంలో 27 గ్రామాల్లో తిరిగానని వెళ్లిన చోటల్లా ఎంతో ఆప్యాయత, అభిమానంతో చిన్నాన్న వసంత్‌పై గౌరవం వారి మాటల్లో మద్దతు కనిపించిందని సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మిగతా మూడు మండలాల్లో కూడా పర్యటించాక భవిష్యత్ రాజకీయంపై వెల్లడిస్తానన్నారు. ఆయన వెంట మాజీ జడ్‌పిటిసి సభ్యుడు కాటి కిరణ్‌కుమార్ ఉన్నారు.

కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం

టి.నరసాపురం: కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని చింతలపూడి మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీ, రామకృష్ణ విమర్శించారు. మండలంలోని కేతవరం గ్రామంలో ఆదివారం తెల్లదోమ సోకిన కొబ్బరి తోటను స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో జగన్మోహనరెడ్డి కొబ్బరి రైతుకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తానని ఇచ్చిన మాట తప్పారని విమర్శించారు. ఇప్పటికైనా కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేసారు.

25న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి టిఎన్‌ఎస్‌ఎఫ్, ఎఐఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యుఐ, ఎఐఎస్‌ఎ తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 25న జరిగే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.అప్పలస్వామి, ఎఐఎస్‌ఎ జిల్లా కార్యదర్శి అఖిల్ పిలుపునిచ్చారు. శనివారం ఏలూరులో అమీనాపేట టిడిపి కార్యాలయంలో టిఎన్‌ఎస్‌ఎఫ్, ఎఐఎస్‌ఎఫ్, ఎఐఎస్‌ఎ, ఎన్‌ఎస్‌యుఐ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏలూరులో పలు విద్యాసంస్థలకు బంద్ నోటీసులు అందించారు. ఈ సందర్భంగా పెనుబోయిన మహేష్ యాదవ్, టి.అప్పలస్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అమ్మఒడి డబ్బులు కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంత మందికీ షరతుల్లేకుండా మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టియన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి సరేపల్లి పవన్, వేగి సిద్దు, కళ్ల హరిబాబు, కొటకల ఫణి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: హాస్టల్ విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించి, జీవో నెంబర్ 77 రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ టిడిపి కార్యాలయం వద్ద విద్యార్థి సంఘాల జేఏసి ఆధ్వర్యంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి పారేపల్లి పవన్ అధ్యక్షతన విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. విద్యార్థి సంఘాలైన టిఎన్‌ఎస్‌ఎఫ్, ఎఐఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యుఐ, ఎఐఎస్‌ఎల ఆధ్వర్యంలో 25న విద్యాసంస్థల బంద్‌కి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ అధికార ప్రతినిధి పారేపల్లి పవన్, ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమిరిశెట్టి దిలీప్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు కండెల్లి శివ, జంగారెడ్డిగూడెం పట్టణ టిఎన్‌ఎస్‌ఎఫ్ చైతన్య పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు మంచి మెనూ

ఏలూరు టౌన్: ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం బలవర్ధకమైన మెనూను అమలు చేస్తుందని కూచింపూడి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహ అధికారి బి.రమేష్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం కూచింపూడి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బి.రమేష్ మాట్లాడుతూ వసతి గృహంలో వసతి, భోజనం, చదువు విషయంలో తల్లిదండ్రులకు పూర్తి భరోసా ఉందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమా నికి ఎంతో కృషి చేస్తుందన్నారు. గత సంవత్సరం 10వ తరగతి పరీక్షా ఫలితాలలో 91 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని చెప్పారు. ఈ ఏడాది అంతకంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామన్నారు. నూతన అడ్మిషన్లకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోటరీ లక్ష్య సాధనకు కృషి

జంగారెడ్డిగూడెం: అంతర్జాతీయ రోటరీ నిర్దేశిత లక్ష్య సాధనకు జిల్లా గవర్నర్ రావూరి వెంకట సుబ్బారావు(దత్తా) మార్గనిర్దేశకత్వంలో శక్తివంచన లేకుండా సభ్యులు, దాతల సహాయ సహకారాలతో కృషి చేద్దామని రోటరీ అధ్యక్షులు రొంగల దేవీప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీమల్లాది సీతారామలింగేశ్వరరావు రోటరీ కమ్యూనిటీ హాల్‌లో రొంగల దేవీప్రసాద్ అధ్యక్షతన కార్యదర్శి బవిరిశెట్టి హనుమాన్ తిలక్ నిర్వహణలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలపర్తి శ్రీనివాస్, దాకారపు కృష్ణ, ధనకుమార్, నూతన కార్యవర్గ సభ్యులకు పలు సూచనలు తెలిపారు. ఈ సమావేశంలో రోటరీ చార్టర్ సభ్యులు చామర్తి శ్రీరాములు, ఉపాధ్యక్షులు వూడా రాంగోపాల్(గోపీ), సహాయ కార్యదర్శి, సభ్యులు పాల్గొన్నారు.

వెండి కిరీటం బహూకరణ

ఆగిరిపల్లి: మండల పరిధిలోని సింగన్నగూడెం బస్టాండ్ వద్ద నున్న శ్రీ సర్వకార్యసిద్ధి షిరిడి సాయిబాబా ఆలయానికి ఈదులగూడెం గ్రామానికి చెందిన నాయుడు శ్రీనివాసరావు దంపతులు వెండి కిరీటాన్ని అలయ అర్చకులు డి.లక్ష్మీనరశింహా మూర్తికి ఆదివారం ఆలయంలో అందజేశారు.

ఘనంగా బాబు పుట్టినరోజు వేడుకలు

ముదినేపల్లి: ఆక్వా మొఘల్ ఎఎన్ బాబు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. సింగరాయపాలెం శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఆయన అభిమానుల కోలాహళం మధ్య ఎఎన్ బాబు కేక్ కట్ చేశారు. ఎఎన్‌బాబు జన్మదిన వేడుకలతో చేవూరుపాలెం, సింగరాయపాలెం సెంటర్ అంతా సందడిగా మారింది.

తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలి

కైకలూరు: ఆడ పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలని సిఐ ఆకుల రఘు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బాలికల వసతి గృహంలో చిన్నారులకు అవగాహన నిర్వహించారు. ఎస్‌పి మేరీ ప్రశాంతి, డిఎస్‌పి శ్రీనివాసరావుల ఆదేశాలపై ఆటపాకలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థినిలతో మాట్లాడుతూ భద్రతాపరమైన అంశాలతో తీసుకుంటున్న చర్యల గురించి ప్రతిఒక్క విద్యార్థినిని అడిగి తెలుసుకున్నారు. ఆపద వస్తే 100, 112 నెంబర్‌లకు ఫోన్ చేసి సాయం పొందవచ్చని తెలిపారు. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి బి.వెంకటరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరం మండలం, రాయకుదురు శివారు జగన్నాధరావు పేట, డో.నెం. 8-114/2 కాపురస్తులైన కడలి చంద్రశేఖర్, తండ్రి: రమావెంకటసత్యనారాయణ అను నేను ది.02-07-2023న రాయకుదురు నుండి వీరవాసరంకు మోటార్ సైకిల్ పై వెళుతుండగా మద్య దారిలో దస్తావేజులు పడిపోయినవి. వాటి వివరాలు: దస్తావేజు నెం.1861/2018 మరియు లింకు దస్తావేజు నెం.3043/2017 గల ఓరిజినల్ దస్తవేజులు పడిపోయినవి. కావున దొరికిన వారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

కడలి చంద్రశేఖర్
తండ్రి: కడలి రమా వెంకట సత్యనారాయణ, జగన్నాధరావు పేట, రాయకుదురు, వీరవాసరం మండలం, ప॥గో॥ జిల్లా.
సెల్: 94933 07573

NOTICE

In the Court of the Hon'ble IInd Addl. District Judge, Eluru

O.S. No. 13/2022

Between:
Sri Panchakarla Vara Prasad ***...Plaintiff***
(rep. by its GPA Holder Sri Koya Syam Kishore)
AND
1. Smt. Amirisetti Sridevi
2. Sri Amirisetti Aruna Kumar
3. Smt. Amirisetti Vijaya ***...Defendants***

To:
D-2: Smt. Amirisetti Sridevi, W/o. (late) Gopichand, R/o. 401, Raja's Pride, Behind Rythu Bazar, Pathebada, Eluru, W.G.Dt.,
D-3: Sri Amirisetti Aruna Kumar, S/o. (late) Gopala Koteswara Rao, R/o. 401, Raja's Pride, Behind Rythu Bazar, Pathebada, Eluru, W.G.Dt.,
D-4: Smt. Amirisetti Vijaya, W/o. Aruna Kumar, R/o. 401, Raja's Pride, Behind Rythu Bazar, Pathebada, Eluru, W.G.Dt.,

పై నెంబరు దావా గ్రంధములో శ్రీ కోర్టు వారు 2వ ప్రతివాది నుండి 4వ ప్రతివాది హాజరు నిమిత్తం పలుమార్లు సమన్లు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీ యొక్క హాజరు నిమిత్తం ది. **11-08-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ వచ్చి మీ వాదనలు తెలుపుకోవలసినదిగా కోరుచున్నాము. మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున పై నెంబరు దావా గ్రంధము పరిష్కరించబడునని తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

T.AJIT RAJ
Eluru — Advocate for the Plaintiff
Dt: 19-07-2023 — Eluru